క్లుప్తంగా

హ్యాపీ బర్త్‌డే మహేష్‌రెడ్డి సార్..



నరసరావుపేట ఈస్ట్: కేబీఆర్ విద్యాసంస్థల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని కాసు సెంట్రల్ మాల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై తన అభిమానులు, గురజాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సందడి మధ్య మహేష్‌రెడ్డి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు.

త్రికోటేశ్వరుడి సేవలో మాజీ ఎమ్మెల్యే కాసు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకస్వాముల ఆశీర్వచనాలు తీసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాసు వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్

యడ్లపాడు: మండలంలోని ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. 33కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం మండలంలోని కొత్తపాలెం, కొండవీడు, సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, లింగారావుపాలెం గ్రామాల పరిధిలో ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కావున ఆయా గ్రామాల్లో గృహ, వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ బోర్లకు సంబంధించి ఎలాంటి విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అసౌకర్యాన్ని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆటల పోటీలకు మోడల్ పాఠశాల విద్యార్థులు



క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

వినుకొండ: చీకటీగలపాలెం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్, రాష్ట్రస్థాయి టెన్నికోయిట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. పాఠశాలకు చెందిన టి.సాయివివేక్‌వర్ధన్, సీహెచ్ ప్రసన్నకుమార్, వి. సుమ గుంటూరులో జరిగిన జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు వివరించారు. అదేవిధంగా శంకరభారతి పురంలో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ టెన్నికోయిట్‌లో ఎ.పావని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పీడీ పాపారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వేధింపులపై ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చు

చిలకలూరిపేటటౌన్: మహిళలపై జరిగే ఎలాంటి వేధింపులకైనా న్యాయం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసీసీలో ఫిర్యాదు చేసుకోవచ్చని ఏఎస్‌సీ లీగల్ కౌన్సిలర్ వాణిశ్రీ చెప్పారు. మండలంలోని కమ్మవారిపాలెంలో మండల పరిషత్ ఎల్‌ఈ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీసీసీ షోషల్ కౌన్సిలర్ సంగీత మాట్లాడుతూ గృహాల్లో, పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపుల నివారణకు ఐసీసీలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలీస్ స్టేషన్‌లకు వెళ్లకుండానే ఐదు రోజుల్లో సంబంధిత కేసుకు సంబంధించి ఉచిత న్యాయం మహిళలు ఐసీసీ ద్వారా పొందవచ్చన్నారు. నాదెండ్ల ఐసీడీఎస్ సీడీపీవో జి.శాంత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐసీడీఎస్ కావూరు సెక్టార్ సూపర్‌వైజరు గౌసియా, భూలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు వ్యక్తి క్వారీ కుంటలో పడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన అంకమ్మ బాబు (41) మంగళవారం మధ్యాహ్నం గేదెలను కాపు కాసేందుకు గ్రామ సమీపన ఉన్న పొలాలకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం చేతులు శుభ్రం చేసుకునేందుకు సమీపంలోని క్వారీ కుంటలోకి దిగాడు. ప్రమాదవశాత్తు లోనికి జారిపడి నీటిలో మునిగిపోయాడు. అయితే ఎంతకు బయటకు కనిపించకపోవడంతో శవాన్ని వెలికి తీసేందుకు గజ ఈతగాళ్లకు పోలీసులు తీసుకువచ్చి గాలింపు చర్యలు చేస్తున్నారు. రాత్రి వరకు శవం ఆచూకీ లభించలేదు.

అడుగడుగునా అడ్డంకులు

- డాక్టర్ గోపిరెడ్డికి అర్ధరాత్రి నోటీసులిచ్చిన పోలీసులు
- ఆర్డీఓ కార్యాలయంకు ర్యాలీగా వెళ్లేందుకు అనుమతి నిరాకరణ
- చివరకు రెండు కార్లలో వెళ్లేందుకు అనుమతి
- బయలుదేరే సమయానికి వాటిని కూడా అడ్డుకున్న వైనం
- రోడ్డుపై ధర్నా చేస్తానంటూ డాక్టర్ గోపిరెడ్డి తీవ్ర ఆగ్రహం
- పోలీసుల పహారాతో ఆర్డీఓ కార్యాలయానికి చేరిక
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లే కారణమన్న డాక్టర్ గోపిరెడ్డి



ఆర్డీఓ కార్యాలయంకు వెళ్లేందుకు బయటకు వచ్చిన డాక్టర్ గోపిరెడ్డిని నిలువరించిన రూరల్ ఎస్ఐ



ఆర్డీఓ కార్యాలయంకు వెళ్లేందుకు వస్తున్న డాక్టర్ గోపిరెడ్డిని నిలువరిస్తున్న సీఐ హైమారావు

నరసరావుపేట: రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు తలపెట్టిన అన్నదాత పోరుకు పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో పార్టీ కార్యాలయం నుంచి బయటకు రానీయకుండా భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. ఉదయం 10 గంటల సమయంలో ముందుగా ప్రకటించిన విధంగా ఆర్డీఓ కార్యాలయంకు వెళ్లేందుకు బయటకు వచ్చిన ఆయనను మీరు ర్యాలీగా వెళ్లేందుకు అనుమతి లేదు అంటూ టుటౌన్ సీఐ హైమారావు, రూరల్ ఎస్ఐ కిషోర్‌లు నిరోధించారు. దీనికి డాక్టర్ గోపిరెడ్డి స్పందిస్తూ తాము శాంతియుతంగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లేందుకు గత మూడురోజుల నుంచి అనుమతి కోసం మీకు దరఖాస్తు చేసుకున్నామని, దీనికి మీరు చెక్ చేసుకోవచ్చని మౌఖికంగా విన్నవించారు. అలాగే సోమవారం అర్ధరాత్రి మాకు అనుమతిలేదంటూ నోటీసులు ఇవ్వటం సముచితంగా లేదన్నారు. ఇప్పుడైనా ఎటువంటి ధర్నా చేయకుండా శాంతియుతంగా నడిచి వెళ్లి రైతులు పడుతున్న సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లేందుకు మాకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి సీఐ హైమారావు పై అధికారులతో మాట్లాడి కేవలం రెండు వాహనాల్లో నాయకులు వెళ్లేందుకు మాత్రమే మీకు అనుమతి ఇస్తున్నామని చెప్పారు. దీనికి డాక్టర్ గోపిరెడ్డి అంగీకరించి రైతులు, కార్యకర్తలు అందరూ మీరు బయలుదేరి వచ్చిన స్థానాలకు వెళ్లిపోవాలని సూచించారు. ఈలోగా చిలకలూరిపేట నుంచి మాజీమంత్రి విడదల రజని నరసరావుపేటకు వస్తున్నారనే సమాచారంతో కొద్దిసేపు ఆగిన అనంతరం ఆమె రాగానే కార్లలో బయలుదేరబోయిన డాక్టర్ గోపిరెడ్డి, నాయకులను పోలీసులు మళ్లీ అడ్డుకున్నారు. దీనికి డాక్టర్ గోపిరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేస్తూ మీరీ విధంగా ప్రవర్తిస్తే నేను రోడ్డుపై కూర్చొని ధర్నా చేస్తానని హెచ్చరించారు. రెండు కార్లలో వెళ్లేందుకు అంగీకరించాం. తీరా ఇప్పుడు ఒకటే కారు అనటం ఏమిటని, తాము మీకు సహకరిస్తున్నా ఈవిధంగా వ్యవహరించటం బాగాలేదని పోలీసు అధికారులతో అన్నారు. చివరకు నాయకులతో కలిసి డాక్టర్ గోపిరెడ్డి పోలీసుల పహారా మధ్య ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆర్డీఓ కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద బందోబస్తు నిర్వహిస్తూ వచ్చిన వారిలో కేవలం మాజీ మంత్రి విడదల రజనితో పాటు మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా, మరికొంత మంది నాయకులను మాత్రమే లోపలికి వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. దీనిపై డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు అన్నదాత పోరు విజయవంతమైతే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందనే దుగ్ధతో కార్యక్రమాన్ని అడ్డుకున్నారని, అయినప్పటికీ రైతులు భారీసంఖ్యలో హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుపై కొంతమంది రైతులు తీవ్రంగా స్పందించారు.

రైతు పరిస్థితి అగమ్యగోచరం



కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గ్రామాల్లో టీడీపీ నాయకులు స్లిప్‌లు రాసిస్తే రైతులు యూరియా తెచ్చుకునే పరిస్థితి వచ్చింది. గతంలో మిర్చి క్వింటా రూ.25 వేలు పలుకగా ఇప్పుడు రూ.10వేల లోపే ఉంది. రూ.266ల యూరియా బ్లాకులో రూ.460లు పెట్టినా దొరకటం కష్టంగా ఉంది.

–వెంకటరెడ్డి, రైతు, మాచవరం, రొంపిచర్ల మండలం

యూరియా దొరకడం లేదు



నేను నాలుగు ఎకరాల పంట వేశా. యూరియా దొరకటమే కష్టంగా మారింది. గత ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ అందజేశారు. ఇంటికి డోర్ డెలివరీ చేశారు. కూటమి ప్రభుత్వం అరాచకానికి పాల్పడుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుంది. ఇదేవిధంగా ఉంటే రానున్న కాలంలో ప్రజల నుంచి వ్యతిరేకత చూడాల్సి వస్తుంది.

–రమణారెడ్డి, వడ్లమూడివారిపాలెం, రొంపిచర్ల మండలం

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణులు డాక్టరు గురుస్వామి మాట్లాడుతూ 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా వైద్య ఆరోగ్య కుటుంబ శాఖ వారి సారథ్యంలో జాతీయ అంధత్వ నివారణ దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. నేత్ర దానం చేయటం ద్వారా ఇద్దరు అంధులకు చూపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, భవిత సెంటరు ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త లింగాల శ్రీలలిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న టాటా ఎస్ వాహనం

నాదెండ్ల: నూతన బైపాస్ రోడ్డుపై గణపవరం–అప్పాపురం క్రాసింగ్ వద్ద మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ నుంచి కుప్పం జిల్లా కృష్ణగిరికి దబ్బకాయల లోడుతో వెళ్తున్న టాటా ఎస్ వాహనం ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. దీంతో టాటా ఎస్ వాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొంది. టాటా ఎస్ ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా దబ్బకాయలు రోడ్డుపై పడ్డాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

ముగిసిన కాకాని చేపల చెరువు వేలం

- గ్రామ సచివాలయంలో వేలం పాట నిర్వహణ
- హోరాహోరీగా సాగిన వేలం
- ఆర్‌డీవో మధులత ఆధ్వర్యంలో వేలం



వేలంపాటను నిర్వహిస్తున్న ఆర్డీవో మధులత

నరసరావుపేట రూరల్: కాకానిలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లో చేపల సాగుకు బహిరంగ వేలంపాట మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఆర్‌డీవో కె.మధులత ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. హోరాహోరిగా సాగిన వేలంపాటలో గ్రామానికి చెందిన ముద్లమూరి కోటేశ్వరరావు అత్యధికంగా రూ.10.10 లక్షలకు చేపల చెరువును వేలంలో దక్కించుకున్నాడు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన వేలంపాటలో పాల్గొనేందుకు కాకానికి చెందిన చుండు కొండలరావు, ముద్లమూరి కోటేశ్వరరావు రూ.50వేలు దరావత్తు చెల్లించారు. 11 గంటలకు ప్రభుత్వ నిర్ణయించిన ధర రూ.5.33, 500లతో వేలం పాటను ఆర్డీవో ప్రారంభించారు. దరావత్తు చెల్లించిన ఇద్దరు చెరువును దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. 12వ పాటలో ముద్లమూరి కోటేశ్వరరావు రూ.10.10 లక్షలకు పాడగా కొండలరావు అంతకంటే అధికంగా పాడేందుకు ముందుకు రాలేదు. దీంతో చేపల వేలంను ముద్లమూరి కోటేశ్వరరావు దక్కించుకున్నట్లు ఆర్డీవో మధులత ప్రకటించారు. వేలంలో పాటను దక్కించుకున్న పాటదారుడు వారం రోజుల్లో మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని ఆర్డీవో తెలిపారు. పాటదారుడు నిర్ణీత సమయంలో మొత్తాన్ని చెల్లించకపోతే రెండవ పాటదారుడికి వేలం దక్కుతుందని పేర్కొన్నారు. పాట దారుడు 30-06-2026 వరకు చేపల సాగు చేసుకునే హక్కు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, మైనర్ ఇరిగేషన్ ఏఈ కిరణ్ కుమార్, మత్స్యశాఖ అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన కూటమి వ్యూహం

గత సంవత్సరం వేలం పాట నిర్వహించకుండానే కూటమి నాయకులు అనధికారికంగా చేపల సాగును చెరువులో చేపట్టారు. ఈ ఏడాది కూడా వేలాన్ని అడ్డుకునేందుకు కూటమి నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. వేలంపాటలో పాల్గొనకుండా గ్రామస్తులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ధరకే వేలంను దక్కించుకునే వ్యూహం పన్నారు.

అయితే వేలంలో ఇద్దరు పాల్గొనడంతో టీడీపీ నాయకుల పథకం బెడిసికొట్టింది. చేపలచెరువు సాగు అవకాశం ఈ ఏడాది మాకు ఇవ్వాలని టీడీపీ నాయకులను అదే పార్టీకి చెందిన ఎస్సీ కాలనీ నాయకులు అడిగారు. దీనికి గ్రామ నాయకులు అంగీకరించకపోవడంతో వేలంలో పాల్గొనాలని ఎస్సీ కాలనీ నాయకులు నిర్ణయించారు. ఇందు కోసం రూ.10 లక్షల వరకు సమీకరించారు. ఈ మేరకు వేలంపాటలో పాల్గొని రూ.10 లక్షల వరకు పోటీలో నిలిచారు.

ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేదయ్యా..

- వ్యవసాయ అధికారులను నిలదీసిన కాకాని గ్రామరైతులు
- గ్రామంలో యూరియా కొరతపై అవగాహన కార్యక్రమం
- పాల్గొన్న డీఏవో జగ్గారావు, ఇతర అధికారులు
- ఎరువుల సరఫరా లేకపోవడంతో ప్రశ్నించిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న జగ్గారావు

నరసరావుపేట రూరల్: గ్రామంలో అన్ని పంటలు పండిస్తున్నా ఒక్క బస్తా యూరియా ప్రభుత్వం నుంచి అందలేదని కాకాని రైతులు వ్యవసాయ అధికారులను నిలదీశారు. గ్రామంలో ఉన్న ఆర్‌బీకేను మూసివేశారు. యూరియా కావాలంటే పెట్లూరివారిపాలెం రైతు సేవా కేంద్రంకు గాని, ఉప్పలపాడు సొసైటీకి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ యూరియా అందుబాటులో లేకపోవడంతో నరసరావుపేటలోని దుకాణాల్లో రూ.400కు పైగా చెల్లించి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం యూరియా అందుబాటులో ఉందని చెబుతున్నా తమకు మాత్రం అందడం లేదని రైతులు వ్యవసాయ అధికారులకు స్పష్టం చేశారు. యూరియపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో శాంతిలు మంగళవారం పెట్లూరివారిపాలెం, కాకాని గ్రామాల్లో పర్యటించారు. కాకానిలో జగ్గారావు మాట్లాడుతూ యూరియా కొరతపై అపోహలు నమ్మవద్దని, జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని డీఏవో జగ్గారావు రైతులకు వివరించారు. గ్రామాల్లో యూరియా కొరత ఉందని తెలిస్తే ఆర్‌ఎస్‌కేలు, సొసైటీల ద్వారా అందజేస్తామని తెలిపారు. ఖరీఫ్‌కు 34,500 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 36 వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చిందని, ఇప్పటికే 33 వేల మెట్రిక్ టన్నులు విక్రయించినట్టు తెలిపారు. 3 వేల టన్నుల నిల్వలు జిల్లాలో ఉన్నాయని, మరో ఐదువేల టన్నుల కావాలని ప్రభుత్వాన్ని అడిగినట్టు వివరించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి ఒక్క బస్తా కూడా ఇవ్వకుండా కొరత లేదు అని ఎలా చేబుతారని నిలదీశారు. గ్రామానికి ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఎరువులు వాడకం తగ్గించాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

శావల్యాపురం: రైతులు ఎరువులు వినియోగం తగ్గించాలని మండల ప్రత్యేక అధికారి డీఎల్‌డీవో మూలె వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మన గ్రోమార్ సెంటరులో ఎరువులు వినియోగంపై రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు అధికంగా ఎరువులు వినియోగిస్తే భూమి సారవంతం కోల్పోవుతుందని, యూరియా, డీఏపీ ఎరువులు కోసం రైతులు ఆందోళన పడాల్సిన పని లేదని వారు వివరించారు. సాగు చేసే పంటలు ఆధారంగా ప్రభుత్వం ప్రతి రైతుకు అన్ని రకాల ఎరువులు సకాలంలో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు యం.అర్జున్ నాయక్, సొసైటీ చైర్మన్ గడుపూడి విశ్వనాథం, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు, మన గ్రోమార్ మేనేజరు సురేంద్ర రైతులు పాల్గొన్నారు.

పంటలపై యూరియా వాడకం తగ్గించాలి

నూజెండ్ల: వ్యవసాయంలో యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ అన్నారు. మండలంలోని ఐనవోలు, పెద్ద వరం గ్రామాల్లో పంట మార్పిడి విధానం, పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగు, యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎ.ఒ. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం వల్ల భూసారం తగ్గటమే కాక భూమి చౌడు బారుతుందన్నారు. యూరియాని అధికంగా వాడకం వల్ల మొక్కలు ఏపుగా పెరిగి చీడపీడలు, తెగుళ్ల ఎక్కువగా ఆకర్షింపబడతాయన్నారు. దీనికి బదులుగా నానో యూరియా (లిక్విడ్) రూపంలో అందించటం ద్వారా సమస్యను అధిగమించవచ్చన్నారు. వ్యవసాయంలో పంట మార్పిడి విధానం చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.

పురుగు మందుల దుకాణాలను తనిఖీ

రైతులు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వినియోగించుకోవాలని ఈపూరు మండలం ప్రత్యేక అధికారి ఐ.వెంకట్రావు అన్నారు. మంగళవారం కలెక్టరు ఆదేశాల మేరకు ఈపూరు మండలంలోని కొండ్రముట్ల, ఈపూరు గ్రామాల్లోని ఎరువులు పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు అవసరమేరకు మాత్రమే యూరియా ఎరువును వాడాలన్నారు.

పువ్వాడ నుంచి చెన్నై ప్రయాణించిన మానవత్వం!



నూజెండ్ల మండలం పువ్వాడ గ్రామానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ మహేశ్వరరెడ్డి మానవత్వం చాటుకున్నారు. తలసేమియా వ్యాధితో చెన్నైలో చికిత్స పొందుతున్న ముట్లూరి యోనా దంపతుల కుమారులైన చందు, లూకాలకు మూడు నెలలుగా నిలిచిపోయిన పింఛన్ డబ్బును చెన్నై వెళ్లి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో భాగంగా వారు రెండు నెలలుగా పింఛన్ తీసుకోవడం లేదు. గ్రామంలో విచారించగా చికిత్స నిమిత్తం చెన్నై హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నట్లు తెలుసుకున్నారు. ఈ నెలలో పింఛన్ తీసుకోకపోతే వారు శాశ్వతంగా పింఛన్ కోల్పోతారని డిజిటల్ అసిస్టెంట్ మహేశ్వర రెడ్డి చెన్నై వెళ్లి వారిద్దరికీ మూడు నెలల పింఛన్లు మొత్తం రూ. 60 వేలు అందజేశారు.

–వినుకొండ

ఊరికి వన్నె తెచ్చిన వారిని సన్మానించడం తప్పా!

- మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం
- పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన నాదస్వర విద్వాంసులు మహబూబ్ సుభాని, కాలేషాబి దంపతుల సన్మానం విషయమై వివాదం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న షేక్ రఫాని

చిలకలూరిపేట: ఊరికి వన్నె తెచ్చిన వారికి సన్మానం చేయడానికి అభ్యంతరం చెప్పడం ఏమిటి... ఊరి పేరు ప్రతిష్టలు వెలుగులోకి తెచ్చిన విద్వాంసులకు, పట్టణ ప్రజలకు సేవలు అందించిన వారికి గౌరవించుకుంటే తప్పేంటి అంటూ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ రఫాని అధ్యక్షత వహించారు.

ఎజెండాలోని మొదటి అంశంగా నాదస్వర విద్వాంసులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన షేక్ మహబూబ్ సుభాని, షేక్ కాలేషాబి దంపతులతో పాటు వివిధ రంగాలలో ప్రజలకు సేవలు అందించిన వారికి పురపాలక సంఘం తరుపున సన్మానించేందుకు పొందుపరిచారు. ఈ విషయాన్ని పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి వ్యతిరేకించారు. సన్మానాలు ఎందుకు, డబ్బులు వృథా అంటూ వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో దేశ విదేశాల్లో నాదస్వర కచేరీలు చేసిన మహబూబ్ సుభాని దంపతులు చిలకలూరిపేట పట్టణానికి చెందిన వారు కావడం ఎంతో గర్వకారణమని, ఇలాంటి వారిని సన్మానించుకోవడం మన అదృష్టంగా భావించాలని హితవు పలికారు. అయినా మౌలాలి సైతం తగ్గకుండా వాగ్వాదానికి దిగడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఎజెండాలోని ఈ అంశాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

సమస్యల గోడు...

వార్డుల్లో నెలకొన్న పలు సమస్యలపై పలువురు కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో మంచినీరు మురుగుగా వస్తున్నాయని ఆరోపించారు. ఖాళీ ప్రదేశాల్లో ముళ్ల కంపలు పెరిగి దోమలు, పందులు విజృంభిస్తున్నాయని, జంగిల్ క్లీనింగ్ చేయించాలని కోరారు. కుక్కల బెడద గురించి ప్రస్తావించారు. ఆయా ప్రశ్నలకు సంబంధించి సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం సమాధానం చెప్పారు. చివరలో వాగ్వాదం అనంతరం ఒకటో అంశం వాయిదా వేసిన చైర్మన్ మిగిలిన అంశాలను ఆమోదిస్తూ సమావేశాన్ని ముగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీవో జి శాంతకుమారి తెలిపారు. ఈ నెల 8 నుండి 29 సాయంత్రం 5 గంటల వరకూ అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నాదెండ్ల మండలంలో చందవరం అంగన్‌వాడీ ఐదో కేంద్రం (ఓసీ), కనపర్రు ఆరో కేంద్రం (ఎస్సీ), ఇర్లపాడు రెండో కేంద్రం (బీసీ–డీ), గొరిజవోలు మూడో కేంద్రం (ఓసీ), గణపవరం 14వ కేంద్రం (ఎస్సీ), గణపవరం 3వ కేంద్రం (బీసీ–బీ), గణపవరం 15వ కేంద్రం (ఎస్సీ), తిమ్మాపురం 2వ కేంద్రం (ఎస్సీ), తిమ్మాపురం 5వ కేంద్రం (ఓసీ), సందెపూడి (ఓసీ), ఉన్నవ రెండో కేంద్రం (ఓసీ), యడ్లపాడు 4వ కేంద్రం (ఎస్టీ), తిమ్మరాజుపాలెం (ఓసీ), మద్దినగర్ (బీసీ–ఈ), వి.బి. కాలనీ (బీసీ–ఏ) ఒక్కోటి చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై, ది.01.07.2025వ తేదినాటికి 21 ఏళ్ల నిండి 35 ఏళ్ల మించని, స్థానికంగా నివాసముంటున్న వివాహితురాలు అర్హులన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను నాదెండ్లలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు 9491051609 నంబరు నందు సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి బ్రిడ్జి మూసివేత

రొంపిచర్ల : మండలంలోని మునుమాక రైల్వేస్టేషన్ పరిధిలో గల అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నేటి బుధవారం తాత్కాలికంగా మూసివేయనున్నట్లు తహసీల్దార్ బి.నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణమధ్య రైల్వే నల్లపాడు వారి ఆదేశాల మేరకు మునుమాక రైల్వేస్టేషన్‌లో గల ఎల్‌సి నెం .279 వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి మరమ్మతుల నిమిత్తం ఈ నెల 10 నుండి వచ్చే నెల 9 వరకు నెల రోజుల పాటు మూసివేయబడుతుందన్నారు.

ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివరాం ప్రసాదు, ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌జీఓలు భాగస్వామ్యం కావాలని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శివరాం ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయానికి విచ్చేసిన కమిషనర్ శివరాం ప్రసాద్‌ను జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులు ఆర్. కనకదుర్గపద్మజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. శివరాం ప్రసాదు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల మృతుల గణాంకాల్లో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. అనేక రోడ్డు భద్రతా సూచనలు విస్తృతంగా ప్రచారం చేయడానికి ఎన్‌జీఓలు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్, తనిఖీ అధికారి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.